
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024



రక్తదానం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 1: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు సంధ్యారెడ్డి, రజనీరెడ్డిలు సోమవారం రక్తదానం చేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదాతలు వారి కుటుంబ సభ్యులను కూడా రక్తదానం చేయడానికి ప్రోత్సహించాలన్నారు. సిబ్బంది మాదవి, మల్లీశ్వరి, సంధ్య, శైలజ, మౌనిక, వేణు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:31
మంగళవారం
సహర్ | 4:46
బుధవారం



రైతుబీమా అక్రమాలపై ఆర్డీఓ సమక్షంలో విచారణ జరుపుతున్న తహసీల్దార్ (కుడివైపు వ్యక్తి)

తహసీల్దారే సూత్రధారి..?

- జప్తు చేసిన భూములకు రెక్కలు
- నోటీసిచ్చిన అధికారితోనే పట్టా మార్పిడి
- గుట్టుచప్పుడు కాకుండా ఇతరులకు విక్రయం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

మంచిర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):దండేపల్లి మండలంలో ఇద్దరు రైతులు వృద్ధాప్య పింఛన్ పొందుతూ అక్రమంగా రైతు బీమాలో దరఖాస్తు చేసుకున్నారు. వారు మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు పరిహారం పొందారు. ఈ సంఘటనపై తహసీల్దార్ విచారణ చేపట్టి పరిహారం సొమ్ము కింద భూములను జప్తు చేయాలని నోటీసులు జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉండగా నోటీసు జారీ చేసిన తహసీల్దార్ జప్తు చేసిన భూమికి సంబంధించి పట్టా చేయడం విశేషం. ఈ వ్యవహారంలో తహసీల్దార్ సూత్రధారిగా వ్యవహరించాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తప్పుడు ఆధార్‌లతో రైతు బీమాకు దరఖాస్తు

కొర్విచెల్మ గ్రామానికి చెందిన గోపతి రాజయ్య నవంబర్ 2014 నుంచి జూలై 2020 వరకు పింఛన్ ఐడీ నెంబర్ ఏడీడీఈఆర్ 06033 ప్రకారం ప్రతీ నెల రూ.2016 వృద్ధాప్య పింఛన్ పొందారు. అప్పుడు ఆయన వయస్సు 75 సంవత్సరాలుగా నమోదు చేయించారు. ఆధార్ కార్డు (నెంబర్ 748865295542)లో పుట్టిన తేదీని 01-01- 1970గా మార్పు చేస్తూ కుటుంబ సభ్యులు 14-08-2020న రైతు బీమా పథకంలో చేర్చారు. రాజయ్య 28-08-2020న మృతి చెందాడు. రాజయ్య పేరిట తయారు చేసిన తప్పుడు ఆధార్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో ఆయన కుమారుడు గోపతి నారాయణ రైతుబీమా సొమ్ము కోసం దరఖాస్తు చేయగా 29-09-2020న రూ.5 లక్షలు మంజూరయ్యాయి.

ముత్యంపేటకు చెందిన బత్తుల రాజలింగయ్య మార్చి 2015 నుంచి మార్చి 2019 వరకు పింఛన్ ఐడీ నెంబర్ ఏడీడీఈఆర్62317 ప్రకారం ప్రతీ నెల రూ.3016 దివ్యాంగ పింఛన్ పొందారు. అప్పుడు ఆయన వయస్సు 80 సంవత్సరాలుగా నమోదు చేయించారు. ఆధార్ కార్డు (నెంబర్ 672964446204)లో పుట్టిన తేదీని 01-01-1970 మార్పు చేసి 05-11-2018న రైతుబీమా పథకానికి దర ఖాస్తు చేశారు. రాజలింగయ్య 05-05- 2019న మృతి చెందాడు. ఆయన కుమారుడు బత్తుల తిరుపతి తండ్రి పేరిట రైతుబీమా పరిహారానికి దరఖాస్తు చేయగా 09-07-2019న రూ.5 లక్షలు మంజూరయ్యాయి.

ఒకే వ్యక్తి వృద్ధాప్య పింఛన్, రైతు బీమా పొందడానికి అనర్హుడు. వృద్ధాప్య పింఛన్ 59 సంవత్సరాల తరువాత వర్తిస్తే, రైతు బీమా పథకానికి ఆ లోపు వయసున్న వారు మాత్రమే అర్హులు. రెండు సంఘ టనల్లో అక్రమాలు చోటు చేసుకోగా 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో జూలై 2న 'రైతు బీమా పక్కదారి' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనాన్ని సీరియస్‌గా తీసుకున్న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. అప్పటి కలెక్టర్ భారతి హోళికేరి ఆదేశాల మేరకు ఆర్డీవో దాసరి వేణు విచారణ చేపట్టారు. తహసీల్దార్ హన్మంతరావు, ఎంపీడీవో శ్రీనివాస్ సమక్షంలో బత్తుల రాజలింగయ్య, గోపతి రాజయ్య కుటుంబ సభ్యులను విచారించారు. అక్రమ పద్ధతుల ద్వారా చెరో రూ.5 లక్షల చొప్పున రైతు బీమా సొమ్ము పొందినట్లు తేలింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు దళారీగా వ్యవహరించిన వారిపై అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భూముల జప్తునకు నోటీసులు జారీ...

రైతుబీమాలో అక్రమంగా సొమ్ము కాజేసిన బత్తుల రాజలింగయ్య, గోపతి రాజయ్యలకు నామినీలుగా ఉన్న బత్తుల రాజేశ్వరి, గోపతి నారాయణల నుంచి అక్రమంగా లబ్ధి పొందిన సొమ్ము రూ.5 లక్షల చొప్పున రూ.10 లక్షలు రికవరీ చేయాలనే ఆర్డీవో ఆదేశాలతో జూలై 13న తహసీ ల్దార్ హన్మంతరావు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించకపోవడంతో వారికి చెందిన భూములను జప్తు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నామినీలు ఇరువురికి తహసీల్దార్ హన్మంతరావు సెక్షన్-7 కింద డిమాండ్ నోటీసులు జారీ చేశారు. కొర్విచెల్మలోని గోపతి నారాయణకు సంబంధించిన భూముల సర్వే నెంబర్లు 52/6/1లో 1.2ఎకరాలు, 236/5/1లోని 0.22 ఎకరాల భూములతో పాటు ముత్యంపేటలోని బత్తుల రాజేశ్వరికి సంబంధించిన సర్వే నెంబర్లు 5/అలో 0.4 ఎకరాలు, 39/అలో 0.1 ఎకరాలు, 39/ఆలో 0.32 ఎకరాలను జప్తు చేస్తున్నట్లు నోటీసులు జారీ అయ్యాయి. నామినీలు ఇద్దరు చెరో రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలని, లేనియెడల పైన పేర్కొన్న భూములను వేలం వేస్తామని తహసీల్దార్ నోటీసుల్లో పేర్కొన్నారు.

చేతులు మారిన భూములు...

అక్రమంగా ప్రభుత్వ సొమ్మును కాజేసినందున నామినీల భూములు జప్తునకు ఆదేశించగా, అవే భూములు ప్రస్తుతం చేతులు మారాయి. గోపతి నారాయణకు చెందిన సర్వే నెంబరు 52/6/1లోని 1.2 ఎకరాలు కార్యాకరి శ్రీనివాస్ పేరిట పట్టాగా మారగా, ధరణి పోర్టల్‌లో నమోదు కూడా అయ్యాయి. జప్తునకు ఆదేశించిన భూములు బీమా సొమ్ములు చెల్లించకుండానే చేతులు మారగా, జప్తు చేస్తామంటూ డిమాండ్ నోటీసు జారీ చేసిన తహసీల్దారే స్వయంగా పట్టా మార్పిడి చేయడం కొస మెరుపు. ఈ విషయమై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమ పట్టాలు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల పర్యవేక్షణేది?

- ఎంఈవోలు లేక ఇబ్బందులు
- జిల్లాలో ఒక్క రెగ్యులర్ ఎంఈవో లేరు
- నాలుగు మండలాలకు కలిపి ఒక ఇన్‌చార్జి ఎంఈవో
- అదనపు పని భారంతో ఇబ్బందులు

భీమిని, ఏప్రిల్ 1: ప్రభుత్వ బడుల్లో విద్యా బోధన గాడి తప్పుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందా లన్నా.. మంచి ఫలితాలు సాధించాలన్నా...విద్యా బోధన ఎంత ముఖ్యమో పర్యవేక్షణ కూడా అంతే ము ఖ్యం. ఇప్పటికే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుం డగా, పర్యవేక్షించే అధికారుల కొరత తోడైంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం కూడా అంతంత మాత్రంగానే అందుతోందనే విమర్శలున్నాయి. రెగ్యులర్ ఎంఈవోలను నియమించని కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది.



● కొరవడిన పర్యవేక్షణ....

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 586, ప్రాథమికోన్నత పాఠశాలలు 180, ఉన్నత పాఠశాలలు 283 ఉండగా ఒక్కరు కూడా రెగ్యులర్ ఎంఈవోలు లేరు. ఒక్కొక్కరికి 4 మండలాలకు ఇన్‌చార్జీలుగా నియమించారు. దీంతో ఏ మండలానికి సరైన న్యాయం చేయలేక పోతున్నారు. విద్యా ర్థులకు పాఠశాల దుస్తులు, ఉచిత పుస్తకాలు, ఉపాధ్యా యుల పనితీరు, సమయానికి వస్తున్నారా లేదా బోధన ఎలా చేస్తున్నారు, పాఠశాలల్లో వసతుల వివరాలను గమనిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారికి అనుసంధానకర్తగా ఎంఈవో ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్లో బాధ్యతల్ని చక్కగా నిర్వర్తిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

● జిల్లాలో 18 మండలాలు 7 ఇన్‌చార్జి ఎంఈవోలు

మంచిర్యాల జిల్లాలో 18 మండలాల్లో 7గురు పీజీ హెచ్‌ఎంలు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక్కో పీజీ హెచ్‌ఎంకు నాలుగేసి, మూడేసి, రెండేసి మండలాలను పర్యవేక్షిస్తూ ఏ మండలానికి న్యాయం చేయలేక పోతున్నారు. వీటిలో పీహెచ్‌ఎంలు మహేశ్వర్ రెడ్డి 4, పోచయ్య 4, తిరుపతిరెడ్డి 2, ప్రభాకర్ 2, రాధాకృష్ణ 3, రవీందర్ 2, విజయ్‌కుమార్ 1 చొప్పున ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించారు.

● పనిభారం ఇలా...

ఎంఈవోలకు టీచర్ల సమయపాలనపై తనిఖీలు, సకాలంలో సిలబస్ పూర్తి, కాలానుగుణంగా టెస్టులు, పరీక్షలు నిర్వహించేలా చూడటం వంటి విధులు ఉంటాయి. మధ్యాహ్న భోజనం అమలు, ఉపాధ్యాయుల సెలవులు, ఆరోగ్య సమస్యల దరఖాస్తుల పరిశీలన, పాఠశాలలను తనిఖీ చేసి పరిస్థితులను మెరుగుపరచాల్సి ఉంటుంది. కాని ఎంఈఓల కొరతతో పనులు ప్రస్తుతం మరుగన పడ్డాయి. ప్రయివేటు పాఠశాలలను తనిఖీలు, అనుమతుల పరిశీలన కూడా ఉంటుంది. పదో తరగతి ఫలితాల మెరుగు పరచడం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం అదికూడా గాడి తప్పింది. టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు, ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాలు కూడా ఎంఈఓల కొరత వల్ల నామమాత్రంగా సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం స్పందించి ఎంఈవోల కొరతను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటాం....
డీఈఓ, మంచిర్యాల, ఎస్ యాదయ్య

సర్వీస్ రూల్స్ పెండింగ్ ఉన్నందున ఎంఈవో పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. జిల్లాలో ఎంఈవోల కొరత ఇబ్బందిగానే ఉంది. అయినా కూడా ఎక్కడా పాఠశాలల్లో సమస్యలు రాకుండా జాగ్రత్త పడుతున్నాం. పాఠశాలలను నిరంతర తనిఖీలు చేస్తున్నాం.

వాహనాల కొనుగోలులో అక్రమాలు



సీడీఎంఏకు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

బెల్లంపల్లి, ఏప్రిల్ 1: బెల్లంపల్లి మున్సిపాలిటీలో వాహనాల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారని పట్టణంలోని 20 మంది కౌన్సిలర్లు సోమవారం సీడీఎంకు వినతిపత్రం అందించారు. ఎక్స్‌కావేటర్, చెత్త సేకరణ ట్రాలీలు, స్వీపింగ్ మిషన్, ట్రాక్టర్లు, ఆవ్‌బ్రేషన్‌ల వంటి వాహనాలను నాసిరకమైనవి కొనుగోలు చేసి కమీషన్లు దండుకున్నారన్నారు. ఏఈ, డీఈలు వ్యక్తిగత ప్రయోజనాలను చూసుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఏఈ కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్నాడని, డీఈ బెల్లంపల్లి డిప్యూటేషన్‌లో ఉంటూ కరీంనగర్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ కౌన్సిల్ మీటింగ్‌కు తప్ప రావడం లేదన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్

బెల్లంపల్లి, ఏప్రిల్ 1 : పేద ప్రజల ఇంటి నిర్మాణానికి కేటాయించిన ఇందిరమ్మ లే అవుట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, ఆనంద్, కృష్ణలు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాండూర్ మండలం రేచిని పంచాయతీ బారేపల్లిలో 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి స్థలాలు కేటాయించిందన్నారు. స్థలాలను సుబ్బ దత్తుమూర్తికి చెందిన సర్వే నెంబరు 41/అ లో నుంచి ఎకరం 17 గంటలు, డోకె లక్ష్మీకి చెందిన సర్వే నెంబరు 45/అ లో నుంచి ఎకరం 25 గుంటలు సేకరించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందన్నారు. ఈ భూమిలో 60 ప్లాట్లు చేసి లబ్ధిదారులకు అందజేశారన్నారు. ధరణి పోర్టల్‌లో తాండూర్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి ప్రభుత్వానికి అప్పజెప్పిన భూమిని రాజకీయ పలుకుబడితో రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతుబంధు, క్రాప్‌లోన్ తీసుకుంటున్నాడని ఆరోపించారు. అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్ అయిన సర్వే నెంబరుపై విచారణ జరిపి భూమిని పేదలకు అందించాలని కోరారు.

అధికారులకు కోర్టు నోటీసులు

నెన్నెల, ఏప్రిల్ 1: జెండావెంకటాపూర్‌లోని గోపి చెరువులో చేపలు పట్టుకొనే టెండర్‌ను నిబంధనలకు విరుద్ధంగా అప్పగించిన అధికారులకు బెల్లంపల్లి కోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. టెండరు ఖరారులో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని మాజీ ఉప సర్పంచ్ ఏస్కూరి లచ్చయ్య బెల్లంపల్లి లీగల్ సర్వీసు అథారిటీకి మార్చి 11న ఫిర్యాదు చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో, ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్లు ఈనెల 6న కోర్టులో హాజరు కావాలని నోటీసులు జారీ అయ్యాయి. యేటా రూ. 2 లక్షలకు పైగా టెండరు పాడే చెరువుకు జీపీ తీర్మానం లేకుండా రూ.9 వేలకే అప్పగించారని లచ్చయ్య పేర్కొన్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఆదాయం కోల్పోవడంతోపాటు మత్స్యకారుల ఉపాధి దెబ్బతిన్నదని చెప్పారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో కోర్టును ఆశ్రయించినట్టు వివరించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు

ఏసీసీ, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశాలు, ప్రచారాలు, ర్యాలీలు, మైక్ పర్మిషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వ్యక్తుల గురించి, కులమతాల పట్ల రెచ్చగొట్టేలా, బెదిరించేలా వ్యాఖ్యలు చేయవద్దన్నారు. గడువులోగా ప్రచార సభలు నిర్వహించుకోవాలని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయవద్దని సూచించారు. ఎన్నికల జరిగే రోజు పోలింగ్ బూత్ నుంచి 200 మీటర్ల దూరంలో ఉండాలని, టెంటు, కుర్చీ వేసుకుని ఒక వ్యక్తి మాత్రమే ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. 48 గంటల ముందు ప్రచారం కోసం వచ్చిన స్థానికేతరులు వారి సొంత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



లక్షెట్టిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పద్మన్‌పల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీల పరిశీలన

లక్షెట్టిపేటరూరల్, ఏప్రిల్ 1: లక్షెట్టిపేట మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం రూ.5.80 కోట్లతో నిర్మిస్తున్న పాఠశాల, కళాశాల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే నిధులు మంజూరు చేయించానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో మిగితా నిధులు నిలిచిపోయాయన్నారు. లక్షెట్టిపేటలో సాగునీరు, తాగునీరు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశం సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్లా నాగభూషణం, కౌన్సిలర్లు సురేష్ నాయక్, రందేని వెంకటేష్, కోఆప్షన్ సయ్యద్ షహీద్ అలీ, కిరణ్, సుమన్, చక్రవర్తి, రాజు, శ్రీనివాస్, అమీర్, రాజు, రాజేష్, శ్రీధర్, చంద్రమౌళి, శ్రీకర్, రమేష్ పాల్గొన్నారు.

హాజీపూర్: పద్మన్‌పల్లిలో ఇటీవల పూర్తయిన సీసీ రోడ్డు, డ్రైనేజీలను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధిలో వెనకబడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీ బాలరాజు, నాయకులు పుస్కూరి శ్రీనివాసరావు, దొమ్మటి సత్తయ్య, కుటుంబరావు, ఒడ్డె రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

దండేపల్లి: ఆల్లీపూర్ గ్రామానికి చెందిన మారాజు సతీష్ అనే కాంగ్రెస్ కార్యకర్తకు చెందిన ఇల్లు ఇటీవల ఈదురుగాలులకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. దండేపల్లిలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణ పనులను పరిశీ లించారు.

వనపర్తి రవి చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. కొక్కిరాల రఘుపతిరావు, వనపర్తి భూమన్నల జ్ఞాపకార్థం నెల్కివెంకటాపూర్‌లో వనపర్తి మౌలికరవి ఆధ్వర్యంలో ఉచిత అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, త్రిమూర్తి, శకుంతల, కాంతరావు, తిరుపతి, నగేష్, వెంకటేశ్వర్లు, సతీష్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పదో తరగతి మూల్యాంకనం

ఏసీసీ, ఏప్రిల్ 1: పదో తరగతి పబ్లిక్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దామోదర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూలులో వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం ఉంటుందని, ఇందుకోసం ఏడుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 66 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 384 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 128 మంది స్పెషల్ అసిస్టెంట్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విధులకు హాజరయ్యే వారు ఈ నెల 3న 8 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

సీట్ల కేటాయింపుపై విచారణ జరపాలి

ఏసీసీ, ఏప్రిల్ 1: కేంద్రీయ విద్యాలయాల్లో సీట్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల సీట్ల కేటాయింపులో కొందరు అధికారులు, రాజకీయ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, కేంద్రీయ విద్యాలయాల్లో అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించాలని కోరారు.

నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 1: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరాకు అదనపు కలెక్టర్‌లను తాగునీటి సరఫరా ఇన్‌చార్జీలుగా నియమించి మండల, గ్రామవార్డు స్థాయిల్లో ప్రత్యేక అధికారులకు కార్యాచరణ రూపొందించాలన్నారు. చేతి పంపులు, బోర్‌వెల్‌లకు మరమ్మతు చేయించాలన్నారు. తాగునీటి సరఫరా లేని ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. వడగాలులతో వడదెబ్బకు గురి కాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు జిల్లాలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ రాహుల్, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, డీపీవో వెంకటేశ్వర్‌రావు,డీఈవో యాదయ్య, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి



వాటర్ ట్యాంకు వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

చెన్నూరు, ఏప్రిల్ 1: వేసవిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. సోమవారం నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని రాయిపేట గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని ఓహెచ్‌ఆర్‌ఎస్ వాటర్ ట్యాంకును పరిశీలించారు. వాటర్ ట్యాంకుకు లీకేజీ ఉందని, వెంటనే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. పంచాయతీల్లో నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఎంపీడీవో మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, ఎంపీవో అజ్మత్‌అలీ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం భవనానికి నిధులు కేటాయింపు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

ఏసీసీ, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే రూ.10 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్‌ను సంఘం నాయకులకు అందించారు. నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, జిల్లా ట్రస్టు చైర్మన్ నల్ల శంకర్, నాయకులు రాజారాం, మిట్ట లక్ష్మణ్, పూదరి తిరుపతి, తూముల నరేష్, రాజలింగు, బొలిశెట్టి కిషన్, బోయిని శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠాపన పూజలు



గ్రామంలో శివలింగం ఊరేగింపు

హాజీపూర్, ఏప్రిల్ 1: రాపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన మార్కండేయ ఆలయంలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజులుగా కొనసాగాయి. సోమవారం ఉదయం వేద పండితులు గంగారపు శ్రావణ్‌కుమార్ శర్మ, సాంబయ్యశర్మ చేతుల మీదుగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నర్సింగాపూర్ ఆంజనేయ ఆలయం నుంచి రాపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీ ఆలయం వరకు భజన, వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. ట్రాక్టర్‌పై చేనేత మగ్గంతో పట్టు వస్త్రాలు తయారు చేసి వేద పండితుల సమక్షంలో స్వామివార్లకు అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలు పాల్గొన్నారు.

హద్దురాళ్లు వేస్తుంటే అడ్డుకున్న రైతులు

భీమారం, ఏప్రిల్ 1: మండలంలోని అంకుశాపూర్ శివారులోని వివాదాస్పద భూముల్లో మంచిర్యాల అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు నేతృత్వంలో అటవీ సిబ్బంది హద్దురాళ్ల వేసే ప్రయత్నం చేయగా సోమవారం రైతులు అడ్డుకున్నారు. కొన్నేండ్లుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న భూములకు అటవీ శాఖ సర్వే జరిపి రశీదులు ఇచ్చిందన్నారు.

ప్రభుత్వ నిర్ణయం వచ్చే వరకు భూముల్లోకి రామని చెప్పిన అటవీ అధికారులు ఆకస్మాత్తుగా వచ్చి హద్దురాళ్లు వేస్తామనడం సరైంది కాదన్నారు. అటవీ శాఖ భూముల్లో హద్దు రాళ్ల వేయనున్నట్లు రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు తెలిపారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భీమారం ఎస్‌ఐ రాములు బందోబస్తు నిర్వహించారు.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలి



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

ఏసీసీ, ఏప్రిల్ 1: పట్టణంలోని ఆండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన మున్సిపల్ డంపింగ్‌యార్డు వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ హన్మంతరెడ్డి, బోర్డు అధికారి లక్ష్మీప్రసాద్‌లు అన్నారు. ఆండాళమ్మ కాలనీ ప్రజలు డంపింగ్ యార్డు వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నయీం పాషా సెప్టెంబరులో జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశాడు. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తెలంగాణ పొల్యూషన్ బోర్డు, మంచిర్యాల కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయగా కమిటీ సభ్యులు సోమవారం ఆండాళమ్మ కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చెత్తను కాల్చడం వల్ల పొగ, దుమ్ముధూళితో శ్వాసకోశ వ్యాధులకు గురై అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మున్సిపల్ కమిషనర్‌ను వివరణ అడగగా సింగరేణి నుంచి 25 ఎకరాల భూమిని కేటాయిస్తారని, భూమిని కేటాయించిన వెంటనే ఇక్కడి నుంచి తరలిస్తామన్నారు. అదనపు కలెక్టర్‌ను కంట్రోల్ బోర్డు అధికారులు సంప్రదించగా పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సింగరేణి భూమి కేటాయింపు తది దశలో ఉందని తెలిపినట్లు సమాచారం.

గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధే ధ్యేయం



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

భీమారం, ఏప్రిల్ 1: గ్రామీణక్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయాలని తాలూకా లెవెల్ క్రికెట్ పోటీలను మండలకేంద్రంలో నిర్వహించామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిపేర్కొన్నారు. సోమవారం గెలుపొందిన భీమారంజట్టుకు, రన్నర్ మిట్టపల్లిజట్లకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ కాకా వెంకటస్వామి పేరున తాలూకా లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి మంచిపేరు తీసుకురావాలన్నారు. గెలుపొందిన జట్లకు సత్యనారాయణరెడ్డి దివంగత రాంబాయి రాజిరెడ్డి పేర్ల మీదుగా విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ. 10 వేలను అందజేశారు. నాయకులు మోహన్‌రెడ్డి, రవి, లక్ష్మణ్, భాస్కర్‌రెడ్డి,అమర్‌సింగ్‌నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఎమ్మెల్యే పూజలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 1: యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే స్వామివారిని దర్శించుకుని కుటుంబీకుల పేరిట అర్చనలు చేయించారు. ఆలయఅర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీవివేక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రగతికి మూలాలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 1: విద్యార్థులు ప్రగతికి మూలాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ ఒర్రెగడ్డ ప్రభుత్వ పాఠశాలలో సైబర్‌క్రైం, పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డునెంబరు, ఓటీపీ నెంబర్లు ఎవరికి చెప్పవద్దన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

భీమారం, ఏప్రిల్ 1: ఖాజీపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలనువేసినట్లు పశువైద్యాధికారి రాకేష్‌శర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 150పశువులకు టీకాలువేశామన్నారు. పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలని సూచించారు. కొమ్ముఅశోక్ యాదవ్, దాడి తిరుపతి, మల్లేష్, స్వామి, సిబ్బంది సంపత్, రమేష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి

బెల్లంపల్లి, ఏప్రిల్ 1: రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్‌వెంకటస్వామిలు పేర్కొన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 30 రోజుల పాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడతారని పేర్కొన్నారు. రంజాన్ పండగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేలను ముస్లింలు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, మైనార్టీ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి




కిష్టంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, దొనబండలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

చెన్నూరు, ఏప్రిల్ 1: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కిష్టంపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. ఏగ్రేడ్ రకానికి రూ. 2203, బి గ్రేడ్ రకానికి 2183 చెల్లిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీరు, మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, ఏపీఎం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. సోమవారం దొనబండలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలన్నారు. పౌర సరఫరాల శాఖ డీఎం గోపాల్, తహసీల్దార్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

తాండూర్: అచ్చలాపూర్‌లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏఈవో ధనలక్ష్మీ, పీఏసీఎస్ సెక్రటరీ శ్రీనివాస్, సిబ్బంది అనిల్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

జన్నారం: మొర్రిగూడలో తిరుమల గ్రామైఖ్య సంఘం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ప్రారంభించారు. రైతులందరు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఆర్ఐ వసుంధర పాల్గొన్నారు

కోటపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మహేంద్రనాద్, ఎంపీడీవో ఆకుల భూమన్నలు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుకు మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సంఘం కార్యదర్శి రాజునాయక్, అసిస్టెంట్ కార్యదర్శి లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

నెన్నెల: మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని సెర్ప్‌ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. చిత్తాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని గ్రామైక్య సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మద్దతుధర కోసం రైతులుధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారి జారీచేసిన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలన్నారు. పద్మ, గంగరాజు, మధుసూధన్, స్రవంతి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్: నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొను గోలు చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో కిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, మార్కెటింగ్ అధికారి గజానంద్, జిల్లా మేనే జర్ గోపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 మద్దతు ధర నిర్ణయించామన్నారు. కేంద్రాల వద్ద నీడ, తాగునీరు, ఓఆర్ ఎస్ మెడికల్ కిట్ ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం తూకం వేయడానికి ముందే రైతు వద్ద నుంచి కూపన్, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లను తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ సమన్వయకర్త, ఏపీఎంలు రోజు కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి నివేదిక అందించాలన్నారు. కొనుగోలు వివరాలను రోజు ట్యాబ్‌లలో నమోదు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 1: ఎన్నికల నిర్వహణలో ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్‌మోతిలాల్, ఆర్డీవో రాములుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లోభాగంగా మే13న పోలింగ్, జూన్4న కౌంటింగ్ ఉందన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతీఅంశంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండావిధులు నిర్వహించాలన్నారు. చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో 741 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రిసైడింగ్, సహాయప్రిసైడింగ్ అధికారులు తమ పరిధిలోనిపోలింగ్‌కేంద్రాలపైదృష్టి సారించాలన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

చెన్నూరు: చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పార్లమెంట్‌ఎన్నికల శిక్షణకేంద్రాన్ని కలెక్టర్ బదావత్‌సంతోష్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతిఅంశంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగాజరిగేలా కృషిచేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజేశం (ఫైల్)

దండేపల్లి, ఏప్రిల్ 1: నాగసముద్రం బస్‌స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మాకులపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజేశం(62) సోమవారం ఉదయంపాలు తీసుక రావడానికి తాళ్లపేట పాల కేంద్రానికి స్కూటీపై బయలుదేరాడు. నాగసముద్రం బస్‌స్టేజీ వద్ద జన్నారంనుంచి లక్సెట్టిపేట వైపునకు వస్తున్న టీఎస్ 20బీ 0202 కారు స్కూటీని ఢీకొంది. ప్రమాదంలో రాజేశం తలకు బలమైన గాయం కావడంతో అయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సుమతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూపరాజ్ తెలిపారు.

చల్లంగా చూడు మల్లన్న స్వామి

దండేపల్లి, ఏప్రిల్ 1: సల్లంగ సూడు మల్లాం మల్లన్న స్వామి అంటూ గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దండేపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లాం మల్లన్నస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణం, పట్నాలను నిర్వహించారు. ఆదివారంరాత్రి వందలాది మంది భక్తులు, యాదవ కులస్థులు బోనమెత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. రాత్రి మల్లన్నస్వామి ఆలయం వద్ద బసచేశారు. సోమవారం స్వామికి ప్రత్యేక నైవేద్యాలు వండి ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, మాజీఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మల్లన్నస్వామిని దర్శించుకొన్నారు. ఎమ్మెల్యేవెంట ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ నాగరాణిత్రిమూర్తి, పార్టీ అధ్యక్షకార్యదర్శి అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్, ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్,యూత్ మండల అధ్యక్షుడు ఆకుల దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన ఏసీపీ

చెన్నూరు, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసే స్ట్రాంగ్‌రూంలను సోమవారం జైపూర్‌ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంలవద్ద భద్రత, సౌకర్యాలు ఏర్పాట్ల గురించి చర్చించారు. చెన్నూరు, రూరల్‌సీఐలు రవీందర్, సుధాకర్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కాసిపేట: మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలను సోమవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పరిశీలించారు. మండలంలోని అరిడెపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఓటరు కూడా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్‌కేంద్రాల ఎన్నికలరోజు పకడ్బందీగా పోలీసు బందోబస్తు చేపట్టడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

చెన్నూరు, ఏప్రిల్ 1: మండలంలోని లింగంపల్లి గ్రామంలో మదునపోచమ్మ, మాంతమ్మ, లక్ష్మీదేవరలకు సోమవారం గ్రామస్థులు బోనాల ఉత్సవాలను నిర్వహించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సం దర్భంగా మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచు లక్ష్మీరమేష్, కాంగ్రెస్ నాయకుడు హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమారం, ఏప్రిల్ 1 : భీమారం బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం భీమారం గ్రామానికి చెందిన చింత ప్రదీప్, రేవెల్లి దినాకర్‌లు బస్టాండ్ నుంచి ఇంటి వైపు బైక్‌పై వెళ్తుండగా బస్టాండ్ దాటిన అనంతరం బైక్ అదుపు తప్పి జాతీయ రహదారి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న ప్రదీప్ తలకు తీవ్ర గాయాలు కాగా దినాకర్ చెయ్యికి బలమైన గాయమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు.

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



హాజరైన అధికారులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1: ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాలలో పోలింగ్‌సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల వేళ ఓటర్లు శాంతియుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు తగినచర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి బాధ్యతలు తీసుకోవాలన్నారు. వీవీప్యాట్‌లపై అందరికీ అవ గాహన కల్పించాలన్నారు. అలాగేమాక్‌పోలింగ్ ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. అధికారులు ముందుగానే అన్నివిషయాలు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ప్రిసైడింగ్ అధికారులుపాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సిర్పూర్(టి)లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో రాకేష్

చింతలమానేపల్లి/దహెగాం/సిర్పూర్(టి)/కౌటాల, ఏప్రిల్ 1: చింతలమానేపల్లి మండలకేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో రాజేష్, దహెగాం మండల కేంద్రంలో పీఏసీఎస్ సీఈవో బక్కయ్య, సిర్పూర్(టి) మండలకేంద్రంలో సీఈవో రాకేష్, ఏఈవో కవిత, కౌటాల మండలంలో రెవెన్యూ అధికారి పుష్పలత వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ-గ్రేడు రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2183 మద్దతు ధర ఉంటుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొ న్నారు.

మండలాల్లో పోలీసుల కవాతు



సిర్పూర్(టి)లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సిర్పూర్(టి), ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలకేంద్రంలో సోమవారం డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండరమేష్ సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి పలువీధుల గుండా కవాతు నిర్వ హించారు. డీఎస్పీ మాట్లాడుతూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల పరిధిలో సైతం కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు, పోలీసులు బలగాలు పాల్గొన్నారు.

తిర్యాణి: ప్రజలు నిర్భయంగా ఓటేయడం కోసం, వారిలో భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ సదయ్య అన్నారు. సోమవారం తిర్యాణి మండలంలోని తలండి, పెర్కపల్లి, నాయకపుగూడ గ్రామాల్లో సీఆర్పీఎఫ్ బలగాలతో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాకేష్, ఇన్‌స్పెక్టర్ బద్రిప్రసాద్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్

సిర్పూర్(టి), ఏప్రిల్ 1: కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసు పత్రిలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రమాదకరం కాదని దీనిని మొదటి దశలోనే గుర్తిస్తే నయం అవుతుంద న్నారు. అనంతరం పలువురికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ నవత, డాక్టర్ సునీత, డాక్టర్ పద్మావదతి, సిబ్బంది శ్యాంలాల్, రాజలింగు, నర్సయ్య, కోనేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన పాఠశాల చైర్మన్



విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల చైర్మన్ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 1: హోళీ ట్రినిటీ పాఠశాలకు చెందిన జాదవ్ రిషిక నవోదయ పాఠశాలకు ఎంపికైంది. సోమవారం పాఠశాల చైర్మన్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు విద్యార్థినిని పూల మాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవుకాలంలో మరిన్ని ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర కుమార్, ఉపాధ్యాయులు కోమల్, మహేష్, సిబ్బంది ముషిర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆసిఫాబాద్ పట్టణంలోని సెయింట్ మేరీ ఉన్నతపాఠశాలకు చెందిన చంకపురె ఆదిత్యవర్ధన్ నవోయద పాఠశాలకు ఎంపికయ్యాడు. అ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

కౌటాల: మండల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో విద్యనభ్యస్తున్న దుర్గం హరిప్రియ, ఆలెం చరణ్‌తేజ జవహర్‌నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ యాదగిరి అభినందించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 1: ఆసిఫాబాద్ మండలం పర్శనంబాల గ్రామంలో సోమవారం బాల్యవివాహం నిశ్చయించినట్లు తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్, సిబ్బందితో కలిసి వెళ్లి వివాహ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులకు, కులపెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్యవివాహాలు చేయడంవల్ల చట్టపరమైన, ఆరోగ్య పరంగా ఎదురయ్యే ఇబ్బందుల గురించి వివరించారు. అమ్మాయికి 18సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. కార్యక్రమంలో బాలరక్షభవన్ సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవళి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బార్ అసోసిషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయవాదుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్య క్షుడిగా ఎన్నుకున్న న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రధానకార్యదర్శి రాజీవ్‌రెడ్డి, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌తోపాటు నగేష్, కిశోర్, గాయత్రి, మధురిమ, విద్యాసాగర్, రాజేష్‌లు ప్రమాణస్వీకారం చేశారు.



ప్రణాళికతో సాగు దిగుబడులు బాగు



- సాగుకు ముందస్తు ప్రణాళిక
- వేసవి దుక్కులతో మేలు
- భూసార పరీక్షలు కీలకం
- అధిక ఎరువులతో అనర్థాలు

వాంకిడి, ఏప్రిల్ 1: రెండు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. రైతాంగం ఇప్పటినుంచే సాగుకు సన్నాహాలు చేసుకుంటే మేలు. అయితే ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తే అధిక దిగుబడులు, మంచి లాభాలు పొందే అవకాశముంటుంది. భూసార పరీక్షలు, వేసవి దుక్కులు, చేను చదును, విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల వాడకం, పంటకు అనుగుణంగా భూమిని సిద్ధం చేయడం, తదితర పనులకు ముందస్తుగా ప్రణాళిక తయారు చేసుకుంటే పంట పండించడానికి అదే మంచి మందు అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తొలకరి వర్షాలు పడేవరకు వేచి చూసి వానాకాలం పనులు ప్రారంభించుకునే కంటే ముందునుంచే సాగుకు సన్నద్ధమైతే సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు.

మొదళ్లను భూమిలో కలపడం..

జిల్లాలో ఏటా పత్తి పంట దిగుబడి అనంతరం పత్తిచెట్ల మొదళ్లను కుప్పగా చేసి తగులబెడుతుంటారు. అలా కాకుండా రోటవేటర్ సహాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు కలియదున్నాలి. తర్వాత మరోసారి రోటవేటర్‌తో దున్నాలి. ఇలా చేస్తే భూసారం పెరగడమేకాకుండా పత్తి పంటకు కావాల్సిన కృత్రిమ ఎరువులను తగ్గించవచ్చు. ఈ పద్ధతి జిల్లాలో అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మాత్రమే రైతులు ఆచరించి లాభం పొందుతున్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం..

సేంద్రియ ఎరువులు నేలలో కుళ్లి ఖనిజ పొరలను అభివృద్ధిచేసి పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను అందిస్తాయి. రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపిస్తాయి. సేంద్రి య ఎరువుల్లో పశువులు, కోళ్లు, గొర్రెలు, వానపాముల ఎరువులను వేసి భూమిలో కలియదున్నాలి. సేంద్రియ పదార్థం వేయడం వల్ల భూమి గట్టి పడకుండా గుల్లగా ఉంటుంది. నీరు బాగా ఇంకడం వల్ల భూమిలో తేమ గణనీయంగా పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది.



వేసవి దుక్కులు కీలకం..

వానాకాలం సాగుకు ముందునుంచే పంట పొలాలను చదును చేసుకుని నెలరోజుల ముందు వేసవి దుక్కులు దున్నుకోవాలి. తొలకరికి ముందే పంట విత్తుకోవడానికి భూములను సిద్ధం చేసుకోవాలి. వర్షాలకు ముందే విత్తుకోవడానికి భూములను తయారు చేసుకోవాలి. పంట కోతలతర్వాత భూమిని వృథాగా వదిలివేయకుండా వేసవిలో దుక్కి దున్నినట్లయితే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. నేలను లోతుగా దున్నడంతో కొంత తేమలో ఉన్న కీటకాలు నశిస్తాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని భూమిని దున్నుకోవాలి. ఈ వర్షాలతో లోతుగా దున్నడం మూలంగా వరుస వరుసకు మధ్యలో వర్షపునీరు నిలిచి భూమి లోనికి చేరుతుంది.

మొదటిసారి దుక్కులు దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీకంపోస్టు గానీ, వ్యవసాయ అధికారులు సూచించిన చెరువు మట్టిని గానీ పొలంలో వేసుకోవాలి. దీంతో పంటదిగుబడి సామర్థ్యం పెరుగుతుంది. సేంద్రియ ఎరువులను అందించడం ద్వారా సూక్ష్మపోషక లోపాలను నివారించవచ్చు.

లోతు దుక్కులతో మేలు..

లోతుదుక్కులు దున్నడం చాలా ఉపయోగం. 35-40 సె.మీ. లోతుగా దుక్కి చేయడంవల్ల భూమిలో గట్టిపొర పగిలి నేల బాగా గుల్లబారుతుంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. ఇంకిన నీరు భూమిలో నిలువ ఉండడంవల్ల పంట వేర్లు లోపలి పొరల్లో పెరిగి ఎక్కువ నీటిని, పోషక పదార్థాలను గ్రహించడానికి వీలవుతుంది. లోతు దుక్కిన ప్రభావం 2-3 సంవత్సరాల వరకు ఉండడంతో పంటల దిగుబడులకు భూములు అనుకూలంగా ఉంటాయి.



సాలుకు అడ్డంగా దున్నడం..

సాలుకు అడ్డంగా సేద్యం చేస్తే నీటి సంరక్షణ పెరుగుతుంది. విత్తనం వేయడం, అంతర కృషి చేయడం వల్ల వర్షపునీరు వాలుగా ఉన్న వైపు పరిగెత్తే అవకాశం ఉండదు. నీటివేగం తగ్గి భూమిలోకి ఇంకడానికి అవకాశం కలుగుతుంది. ఎక్కువ నీరు భూమిలోకి ఇంకడం వల్ల తేమ శాతం పెరిగి అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ప్రణాళికతో సాగుచేయాలి
వ్యవసాయ అధికారి మిలింద్



రైతులు ప్రణాళికతో సాగు చేస్తే అధికదిగుబడులు సాధించుకోవచ్చు. వేసవిలో భూములను లోతుగా దున్నుకోవడం వల్ల భూమిలోని పంటలను నాశనం చేసే కీటకాలు చనిపోతాయి. వానాకాలం ప్రారంభానికి రెండు నెలల ముందు నుంచే వేసవి దుక్కులు దున్నుకోవాలి. కొంతమంది రైతులు వర్షాకాలం సమీపించే వరకు పంటలను ఉంచుతున్నారు. వేసవి దుక్కులు దున్నడం లేదు. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. విత్తనాల ఎంపిక, సేంద్రియ ఎరువల వాడకం ఎంతైన అవసరం, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించుకోవాలి.

భూసార పరీక్షలు..

మనిషిలో వ్యాధి నిర్ధారణకు ఏ విధంగానైతే రక్త, మూత్ర పరీక్షలు అవసరమో పంటకు కూడా భూసార పరీక్షలు అవసరమే. భూసార పరీక్షకు ముందు మట్టి నమూనాలు సరైన పద్ధతిలో తీసుకోవాలి. భూమిలో సారం ఎంతవరకు ఉంది. ఎలాంటి విత్తనాలు, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి అనేది తెలుసుకోవడానికి భూసార పరీక్షలు కీలకం. అధిక దిగుబడికి పోటీపడి ఎక్కువ మోతాదులో ఎరువులు వేసి నష్టాలు కొనితెచ్చుకునే కంటే భూసార విలువలు తెలుసుని కాలానికి అనుగుణంగా పంటల సాగు తీరు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. భూసార పరీక్షలపై ప్రభుత్వం విస్తృతప్రచారం చేస్తూ రైతులకు అవగాహన కూడా కల్పిస్తోంది.

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే పంటలు విత్తుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల ద్వారా భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల లోపాలు, మోతాదు పద్ధతిలో ఎరువుల వాడకం ద్వారా అదనపు ఖర్చులు తగ్గించుకునే వీలుంది. భూమిలో భాస్వరం వినియోగాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలి. ఆధునిక యంత్రాల వినియోగం సాంకేతిక పరిజ్ఞానం పాటించడం వల్ల ఎక్కువ దిగుబడులు సాధించుకోవచ్చు. ఇలాంటి పద్ధతులు పాటించకుండా రూ.వేలల్లో పెట్టుబడులు పెడుతూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇసుక నేలలు, బంకమట్టి నేలలు, రేగడి నేలలు, నీరు నిలిచే నేలలు తదితర నేలలకు అనుగుణంగా పంట విత్తుకోవడంతో ఆశించిన దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



శిక్షణను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికలనేపథ్యంలో పోలింగ్ అధికారులు, సహాయపోలింగ్ అధికారులకు ఇచ్చే శిక్షణ చాలా ముఖ్యమైనదని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం పట్టణంలోని బీఈడీ కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీఆర్వో సురేష్, తహసీల్దార్ దేశ్‌పాండేతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే హాజరయ్యారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు ఎన్నికలరోజు విధులను నిర్వర్తించడంపై సూచనలు, సలహాలు చేశారు. పీవోడైరీ, 17సీపై పూర్తిఅవగాహన కలిగిఉండాలని తెలిపారు. పోలింగ్ రోజున అవసరమయ్యే కవర్‌లో సరైన సమాచారం నమోదు చేయాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించి వీవీ ప్యాట్‌లలో ఉండే స్లిప్‌లను ప్రత్యేక కవర్‌లో ఉంచాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందు రోజు, పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటుకోసం ఫారం12ని తప్పనిసరిగా సమర్పించాలన్నారు. కార్యక్రమంలో పోలింగ్ అధికారులు, సహాయ అధికారులు, మాస్టర్‌ట్రైనర్లు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1: కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రోజురోజుకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం జిల్లాలో 41.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణి మండలంలో 41.8 డిగ్రీలు, కెరమెరి మండలంలో 40.5, రెబ్బెన మండలంలో 38.7, కాగజ్‌నగర్ మండలంలో 38.4,వాంకిడి మండలంలో 38.3, జైనూర్ మండలంలో37.7, సిర్పూర్(టి), దహెగాంలలో 37.6, ఆసిఫాబాద్‌లో 37.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అందుబాటులో 'మోడల్' ప్రవేశపరీక్ష హాల్‌టికెట్లు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 1: జిల్లాకేంద్రంలోని తెలంగాణ ఆదర్శపాఠశాల (మోడల్‌స్కూల్)లో 6నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం కోసం ఈ నెల 7న నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచామని ప్రిన్సిపల్ అబ్దుల్‌ఖలీల్ తెలిపార. 6వతరగతికి 10నుంచి 12గంటల వరకు, 7నుంచి 10వ తరగతులకు మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

వృథాగా నీటి తొట్టీలు
● అల్లాడుతున్న మూగజీవాలు



నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

సిర్పూర్(టి), ఏప్రిల్ 1: మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో 27గ్రామాల్లో ప్రభుత్వం వేసవిలో మూగజీవాలు తాగునీటి సౌకర్యం కల్పించా లని ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో వేల రూపాయలు వెచ్చించి నీటి తొట్టిలను నిర్మించింది. దీని బాధ్యత గ్రామపంచాయతీలకు అప్పచెప్పింది. అయితే పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో నీటికోసం అల్లాడుతున్న మూగ జీవాలకు నీటి తొట్టిలతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్టిలు ఉపయోగంలోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
● రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1: ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఇతర కార్యదర్శులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్‌లు, జిల్లాస్థాయి అధికారులతో తాగునీటి ప్రణాళిక, వరిధాన్యం కొనుగోలుకేంద్రాల ఏర్పాటుపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా కార్యాచరణ ప్రకారం నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్‌భగీరథ పైపులైన్లు, చేతిపంపుల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేసి నిరంతరాయంగా నీటిసరఫరా చేయాలని తెలిపారు. ప్రభుత్వం రైతులనుంచి వరిధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈక్రమంలో జిల్లాలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్‌ఎస్, మెడికల్‌కిట్లను అందుబాటులో ఉంచాలి తెలిపారు. వరిధాన్యం విక్రయించిన రైతుల సంబంధిత వివరాలను ఎప్పటి కప్పుడు ట్యాబ్‌లో నమోదు చేసి విక్రయసంబంధిత నగదు వారిఖాతాల్లో జమఅయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ, చేతి పంపుల మరమ్మతులు చేపట్టడంతో పాటు వ్యవ సాయ, బోరు బావుల వద్ద మరమ్మతులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డీఈవో అశోక్, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ అధికారులు, ఈఈ వెంకటపతి, డీఎంహెచ్‌వో తుకారాం, తదితరలు పాల్గొన్నారు.

59.59 శాతం ఆస్తిపన్ను వసూలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో ఆస్తి పన్ను 59.59శాతం వసూలైనట్టు కమిషనర్ అంజయ్య తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో మొత్తం రూ.3.91కోట్ల టార్గెట్‌కు రూ.2.33కోట్లను వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో పూర్తి లక్ష్యాన్ని చేరుకోలేక పోయినట్టు వివరించారు.

కార్మికుల పని వేళలు మార్చాలి

రెబ్బెన, ఏప్రిల్ 1: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పనివేళలను మార్చాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ కోరారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రత రోజురోజుకు తీవ్రంగా పెరుగుతోందన్నారు. కార్మికులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని మధ్యాహ్న సమయంలో ఓపెన్ కాస్టులో విధులు నిర్వహించటం కష్టతరంగా ఉంటోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం తక్షణమే కార్మికుల పని వేళలను మార్చాలన్నారు. అలాగే కార్మికులు ఎండతీవ్రతను తట్టుకోవటానికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు.

ప్రాణహిత కాలువలో దూకి యువకుడి ఆత్మహత్య

బెజ్జూరు, ఏప్రిల్ 1: బెజ్జూరు మండలం బారెగూడెం గ్రామానికి చెందిన ముర్మురె ఉమేష్(25) అనే యువకుడు ప్రాణహిత కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సాదిక్‌పాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. ఉమేష్ ఆదివారం ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో సోమవారం బెజ్జూరు మండలం లంబాడిగూడ ప్రాణహిత కెనాల్‌లో దూకి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడన్నారు. మృతుడి తల్లి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
● మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాఅభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు వెళ్తూ జిల్లాకేంద్రంలోని ఓయూ జేఏసీనాయకుడు అనిల్‌కుమార్ నివాసంలో సోమవారం ఉదయం అల్పహారం చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను గత పాలకులు విస్మరించరన్నారు. జిల్లాలో సాగునీటిరంగాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న అందవెల్లి, గుండి, అనార్‌పెల్లి వంతెనలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. జిల్లాకు ఎస్డీఎఫ్‌కింద రూ.10కోట్లుమంజూరు చేశామన్నారు. జిల్లాలోని జోడేఘాట్, మార్లవాయి, జంగుబాయి, శంకర్‌లోద్ది తదితరప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. పాత అటవీచట్టాలు కొనసాగుతున్నాయని వాటిని తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. రానున్నవేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చుడాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆదరించి మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం పలువురు మంత్రి సీతక్కను సన్మానించారు. ఈ సందర్భంగా పలు వురు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. సమావేశంలో డీసీసీ ఆధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావు, మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతి, ఓయూజేఏసీ నాయకుడు అనిల్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు జువ్వాజీ అనిల్‌గౌడ్, అజ్మీర శ్యాం నాయక్, మునీర్ అహ్మద్, చరణ్, శ్యాం, మురళీ, అసద్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ దొందూ దొందే

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1: ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు దొందూ దొందేనని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపుయూనియన్‌గా గెలుపొందినా యాజమాన్యం గుర్తింపుపత్రం ఇవ్వడం లేదని ఏఐటీయూసీ, తమ ప్రభుత్వం అధికారంలో ఉందనేభావనతో ఐఎన్‌టీయూసీ కార్మికసమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. వారికి అధికారంపైనే ఆశ తప్ప పరిష్కారం చేద్దామనే ఆలోచన లేదని ఎద్దేవాచేశారు. అన్నియూనియన్లు రెండేళ్ల కాలపరిమితికి ఒప్పుకున్నా ఇప్పుడు నాలుగేళ్లు కావాలని అడగడం వెనక ఏఐటీయూసీ అధికార దాహం దాగి ఉందన్నారు. గుర్తింపు యూనియన్ కాలపరిమితి రెండేళ్లు ఉండడమే కార్మికులకు శ్రేయస్కరమన్నారు. సమావేశంలో ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 89 శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1: 2023-24 ఆర్థికసంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియా ఉత్పత్తి 89శాతంగా నమోదైంది. నిర్దేశితలక్ష్యం 66లక్షల 40వేల టన్నులు కాగా, మార్చి31నాటికి 59లక్షల6వేల89టన్నుల బొగ్గును వెలికితీశారు. ఇందులో ఆర్‌కె5 గని లక్ష్యం 2లక్షల70వేల టన్నులు కాగా, 2లక్షల 7వేల 12టన్నులు, ఆర్‌కె 6లక్ష్యం లక్ష80వేల టన్నులు కాగా, లక్ష94వేల 903టన్నులు, ఆర్‌కె7లక్ష్యం 3లక్షల60వేలు కాగా, 3లక్షల38వేల674టన్నులు, ఆర్‌కె న్యూటెక్ లక్ష్యం లక్ష60వేల టన్నులు కాగా, లక్ష60వేల 845టన్నులు, ఎస్‌ఆర్‌పి1 లక్ష్యం లక్ష 50వేల టన్నులుకాగా, లక్ష 60వేల 845టన్నులు, ఎస్‌ఆర్‌పి3,3ఎ లక్ష్యం 2లక్షల80వేలటన్నులు కాగా, 2లక్షల30వేల 178 టన్నులు, ఐకె 1ఎ లక్ష్యం 2లక్షల40వేలటన్నులు, లక్ష 95 వేల 663టన్నులు, శ్రీరాంపూర్ ఓసీపీ లక్ష్యం 35లక్షల టన్నులు కాగా, 31లక్షల 72వేల 897 టన్నులు, ఇందారం ఓసీపీ లక్ష్యం 15లక్షల టన్నులు కాగా, 12 లక్షల 21 వేల 807 టన్నులు ఉత్పత్తి అయ్యింది. కాగా, రైలు మార్గం ద్వారా 62లక్షల 89వేల 944టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 5లక్షల 30వేల 551టన్నులు మొత్తంగా 68లక్షల 20వేల 494టన్నుల బొగ్గును రవాణా చేశారు.

పదవీ విరమణ కార్మికుడికి సన్మానం

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 1: ఆర్కేపీ ఓసీపీలో విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ పొందిన కార్మికుడు కాసర్ల రాజిరెడ్డిని ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ ఆంజనేయులు, నాయకులు పుష్పరాజ్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం: గని మేనేజర్



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 1: రక్షణతో కూడిన ఉత్పత్తే ప్రధాన లక్ష్యమని కేకే5 గని మేనేజర్ అల్లావుద్దీన్ అన్నారు. సోమవారం గనిపై 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను గని 98శాతం ఉత్పత్తి సాధించడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి రక్షణ అనేది ప్రథమ కర్తవ్యమని అన్నారు. దీనిని పాటిస్తూ పనిచేస్తే ప్రమాదాలు జరగవని తెలిపారు. కేకే5 గనికి అటు రక్షణ, ఉత్పత్తిలో రికార్డు ఉన్నందున కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

అదే విధంగా ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలతో పాటు అదనపు ఉత్పత్తిని సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, గనిరక్షణాధికారి రమేష్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్ పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీలకు ఎంపిక

మందమర్రిటౌన్, ఏప్రిల్ 1: ఈనెల4,5,6 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఎంసీఎల్‌లో జరగనున్న కోలిండియా స్థాయి కబడ్డీ పోటీలకు మందమర్రి ఏరియాలో కోల్ శాంప్లింగ్ మజ్దూర్‌గా పనిచేస్తున్న రవికుమార్ ఎంపికయ్యాడు. ఇటీవల మందమర్రిలో జరిగిన ఏరియా కార్మిక వార్షిక క్రీడలతోపాటు రీజియన్‌స్థాయి పోటీల్లో రవికుమార్ ప్రతిభ కనబర్చి కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాడు. రవికుమార్‌ను ఏరియా జీఎం మనోహర్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్‌లు అభినందించారు.

సింగరేణి ప్రగతికి కార్మికులే మూల స్తంభాలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 1: సింగరేణి ప్రగతికి మూల స్తంభాలు కార్మికులేనని గుర్తింపుసంఘం బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన కేకే5 గనిపై మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా నిర్దేశించిన ఉత్పత్తిలక్ష్యాలను అధిగమించాలని, కార్మికులకు ప్రోత్సాహకంగా గిఫ్టులు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, బ్రాంచి సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ కార్డులు అందించండి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్‌ఐకార్డులు అందించాలని సింగరేణి కాంట్రాక్టుకార్మికుల సంఘం (ఎస్‌సికెఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి మధు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ టి రేణుకా ప్రసాద్, సింగరేణి జీఎం పర్సనల్ బి హన్మంతరావుకు వినతిపత్రాలు అందించారు. కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ వైద్యం అందించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించి, కేంద్ర కార్మికశాఖ అధికారుల వద్ద ఒప్పందం కూడా చేసుకుందన్నారు. కానీనేటికీ అమలుకాలేదన్నారు. స్పందించిన జీఎం (పర్సనల్) హన్మంతరావు కార్డులు జారీ చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై వినతి

సింగరేణిలో పనిచేస్తున్న ఎస్సీఎస్టీ ఉద్యోగుల సమస్యలపై షెడ్యూల్డ్ కులాల జాతీయకమిషన్‌సభ్యుడు రామచందర్‌కు విన్నవించినట్లు శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌సి లైజన్ అధికారి, ఎస్‌ఈ(ఐఈడీ) కె కిరణ్‌కుమార్, మాజీ ఎస్‌సి లైజన్ అధికారి, పర్సనల్ మేనేజర్ ఎ రాజేశ్వర్ తెలిపారు. రామగుండం(జ్యోతినగర్) ఎన్‌టిపిసి గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన రామచందర్ త్వరలో సింగరేణి స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించి, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఉత్పత్తి లక్ష్యాలను సాధించిన కార్మికులకు అభినందనలు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 1: ఆర్కేపీ సీహెచ్‌పీకి నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని వారం రోజుల ముందుగానే సాధించడంపై సోమవారం ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్‌అలీ, వైస్‌ప్రెసిడెంట్ ఇప్ప కాయల లింగయ్య, పిట్‌సెక్రెటరీ హరికృష్ణ ఆర్కే సీహెచ్‌పీ కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం స్పందించి గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కష్టపడ్డ కార్మికులందరికి బహుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పిట్ కమిటీ నాయకులు సీతారామరావు, కృష్ణస్వామి, చొప్పదండి స్వామి, మేడ సంపత్ పాల్గొన్నారు.